క్లుప్తంగా

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

కాటారం: మండలంలోని గుండ్రాత్‌పల్లిలో సొంత బావమ్మర్ది సాయికిరణ్‌పై కత్తితో దాడి చేసిన కేసులో బావ ప్రణయ్‌ని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. మండలంలోని గుండ్రాత్‌పల్లికి చెందిన సాయికిరణ్ చెల్లి సాయిప్రియకు చెన్నూర్ మండలం భావురావుపేటకు చెందిన కమ్మగోని ప్రణయ్‌కి గత ఆరేళ్ల క్రితం వివాహం అయింది. ప్రణయ్ భార్యతో పదే పదే గొడవ పడుతూ చిత్రహింసలు పెడుతుండేవాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం సాయిప్రియ తన తల్లిగారింటికి వచ్చి ఉంటుంది. ఈ క్రమంలో సాయికిరణ్‌పై కక్ష్య పెంచుకున్న ప్రణయ్ మంగళవారం రాత్రి గుండ్రాత్‌పల్లికి వచ్చి వెంట తెచ్చుకున్న కత్తితో సాయికిరణ్‌పై దాడికి పాల్పడ్డాడు. సాయికిరణ్ తీవ్రగాయాలపాలవగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం ప్రణయ్‌ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


సుమన్ (ఫైల్)

భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ గ్రామానికి చెందిన సుమన్(24) వారం రోజులక్రితం పనిమీద మహాముత్తారం మండలం యామన్‌పల్లి నుంచి కమలాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో గేదెను తప్పించబోయి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అవివాహితుడు కాగా వారి తల్లిదండ్రుల రోదనలతో కమలాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పంబపూర్, దమెరవాయి, కొండపర్తి గ్రామాల్లో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఫోన్ మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలగాళ్ల మోసాలకు గురితై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా పంబపూర్‌లోని ప్రైమరీ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షల ప్యాడ్, కాంపక్స్ బాక్సులను ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పంపిణీ చేశారు.

రైతులను మోసంచేసిన ప్రభుత్వం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి


భూపాలపల్లి: ధర్నా చేస్తున్న గండ్ర జ్యోతి, బీఆర్‌ఎస్ శ్రేణులు


టేకుమట్ల: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


మొగుళ్లపల్లిలో..

భూపాలపల్లి: రుణమాఫీ చేస్తామని రైతులను నమ్మబలికిన రాష్ట్ర ప్రభుత్వం తీరని మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కొర్రీలు విధిస్తూ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ లింక్ కాలేదని, పేర్లలో తప్పులు ఉన్నాయంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. సొంత పార్టీ నేతలకు రుణమాఫీ అయిందని, అసలైన రైతులకు మాఫీ కాలేదన్నారు. విద్యాసాగర్‌రెడ్డి, సింగనవేన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ రైతాంగానికి రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు లేకుండా రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. మాజీ సర్పంచులు దానబోయిన రాములు, నైనకంటి ప్రభాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పిన్నింటి వెంకట్రావు, బైరగోని లావయ్య, నేర్పడి శ్రీనివాస్, గంట రవీందర్ రెడ్డి, రవీందర్, కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రైతు రుణమాఫీని వెంటనే ప్రకటించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసామని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ పావలా శాతం కూడా రుణమాఫీ కాలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, శ్రీనివాస్, సురేష్, శ్రీనివాస్‌రావు, లక్ష్మన్, రామకృష్ణ, ఓదెలు, మామిండ్ల ఎల్లస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు


ఎమ్మెల్యేతో రైస్ మిల్లర్లు

భూపాలపల్లి రూరల్: బాయిల్డ్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడు వెంగల వినయ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో బాయిల్డ్ మిల్లర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టి తీసుకుపోగా సానుకూలంగా స్పందించారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననీ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నడిపెల్లి ప్రశాంత్ రావు, ట్రెజరర్ కల్లూరి కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ పెండెం రేపాల్, కార్యవర్గ సభ్యులు నర్సింగరావు, శ్రీనివాస్ రావు, రవీందర్, కార్తీక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ఎమ్మార్పీఎస్(టీఎస్)తో పాటు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారేపెల్లి మల్లేశ్, జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మౌలిక వసతులు కల్పించడంలో విఫలం అయిందని మండిపడ్డారు. మైనారిటీ గురుకులాల హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం, నాణ్యమైన విద్య అందించడం లేదన్నారు. సంక్షేమ హాస్టల్‌లో మహిళల ఆరోగ్యం, భద్రత కోసం వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మంద సురేష్, చంద్రగిరి శంకర్, అంబాల అనిల్ కుమార్, పెండెల దేవరాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్, జిల్లా కార్యదర్శి బచ్చల చిరంజీవి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శీలపాక హరీష్, రత్నం కాంతయ్య, నాయకులు నాగుల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

భూపాలపల్లి అర్బన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్లో గురువారం విద్యార్థులతో కలిసి నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ.. కోల్‌కత్తాలో జరిగిన ఘటనపై విచారణ జరిపించి నిందితులను గుర్తించి ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. నాయకులు నరేష్, స్వామి, గణేష్, సాయి, తరుణ్, రఘు పాల్గొన్నారు.

జెన్‌కో పంప్‌హౌస్‌లోకి కొండ చిలువ


పంపుహౌస్‌లోకి దూరిన కొండ చిలువ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కన్నెపల్లిలోని జెన్‌కో పంపుహౌస్‌లోకి పెద్ద కొండచిలువ బుధవారం అర్ధరాత్రి దూరింది. దీంతో పంపుహౌస్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. రాత్రి సమయం కావడంతో అటవీశాఖ అధికారులకు సమచారం అందించిన రాలేదు. కాగా, సిబ్బంది ధైర్యం చేసి తాడుతో రాత్రంతా కట్టివేశారు. గురువారం ఉదయం అటవీశాఖ సిబ్బంది వచ్చి ఆ కొండ చిలువను సంచిలో వేసుకొని అటవీప్రాంతంలో వదిలివేశారు. కొండ చిలువ 15ఫీట్ల పొడవుతో 40–45 కిలోల బరువు ఉన్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు.

గుడుంబా నిర్మూలనకు సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: గుడుంబా నిర్మూలనకు గ్రామస్తులు, యువత, మహిళలు సహకరించాలని ఎస్సై తాజొద్దీన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఎస్సై హాజరై మాట్లాడారు. గుడుంబా తాగడం వల్ల పూర్తి అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. గుడుంబాను నిర్మూలించడానికి మహిళలు ముందు అడుగు వేయాలన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే 100 నంబర్‌కు డయల్ చేయాలని ఎస్సై అన్నారు. ఇంటిలో చిన్న చిన్న గొడవలు జరిగిన 100కు కాల్ చేయడం సరికాదన్నారు. రాత్రి సమయంలో యువత మద్యం తాగి గుంపులుగా కనబడితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గంజాయి నిర్మూలన వాల్‌పోస్టర్లను పోలీసులు ఆవిష్కరించి ప్రధాన కూడళ్లలో అంటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫత్తే మహ్మద్, చేల వినయ్, గ్రామస్తులు, మహిళల పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత


మహాముత్తారం: మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

టేకుమట్ల: మొక్కల పెంపకం ప్రతీ ఒక్కరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి శైలజ, ఎంపీఓ సురేష్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా నాటుదాం ఒక చెట్టు–అమ్మ పేరు మీద కార్యక్రమం గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టేకుమట్ల–రాఘవరెడ్డిపేట ప్రధాన రోడ్డు వెంట మొక్కలను నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా మొక్కలను నాటి రక్షించాలన్నారు. నేడు నాటిన మొక్కలే వృక్షాలై భవిష్యత్ తరాలకు భరోసా కల్పిస్తుందని అన్నారు. ప్రస్తుతం పర్యవరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో పర్యావరణ పరిరక్షణకు తప్పని సరిగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ తుల రమేష్, మహేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాముత్తారం: నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి వేణు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరిట మొక్క నాటాలి

కాటారం: పర్యావరణ సమతుల్యతలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీడీఓ అడ్డూరి బాబు, ఎంపీఓ పిల్లి వీరస్వామి అన్నారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో నాటుదాం చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీఓ పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరి జీవితంలో అమ్మ స్థానం ఎంతో ప్రాముఖ్యమైందని తల్లి పేరు మీద నాటే మొక్క చిరస్థాయిగా ఉండిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేశ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జెడ్పీసీఈఓ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీఆదిముక్తీశ్వరస్వామి ఆలయం వద్ద 'చెట్టు నాటుదాం–అమ్మపేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా గురువారం జెడ్పీసీఈఓ విజయలక్ష్మి మొక్కలు నాటారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్ తదితరులు ఉన్నారు.


కాళేశ్వరం: మొక్క నాటుతున్న జెడ్పీసీఈఓ


టేకుమట్ల: మొక్క నాటుతున్న అధికారులు


కాటారం: మేడిపల్లి పాఠశాలలో..

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి


మాట్లాడుతున్న డీటీడీఓ దేశిరామ్ నాయక్

ములుగు: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని డీటీడీఓ దేశిరాంనాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వసతి గృహంలో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, వార్డెన్‌లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడ చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సానిటేషన్, విద్య కమిటీల విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బ్యాంకును కన్నాయిగూడెం తరలించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: కన్నాయిగూడెంలో నడిచే పంజాబ్‌నేషనల్ బ్యాంకును 1992లో ఏటూరునాగారానికి తరలించారని తిరిగి కన్నాయిగూడేనికి తరలించాలని బీజేపీ జిల్లా నాయకుడు పల్లా బుచ్చయ్య, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని పంజాబ్‌నేషనల్ బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ.. 1992 పూర్వం కన్నాయిగూడెంలో బ్యాంకు నడిచేదని ఆ తర్వాత కొన్ని కారణాల దృష్ట్యా ఏటూరునాగారం తరలించారన్నారు. ఇప్పుడు కన్నాయిగూడెం మండలం ఏర్పాటు అయ్యిందని అక్కడ పోలీస్‌స్టేషన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఏర్పాటు అయ్యాయన్నారు. ఏటూరునాగారంలో ఉండడం వల్ల 50 కిలోమీటర్ల దూరం నుంచి రైతులు, విద్యార్థులు రావాల్సి వస్తోందని, తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారన్నారు. అన్ని రకాల సౌకర్యాలు కన్నాయిగూడెం కల్పించే విధంగా చూస్తామని అన్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బ్యాంక్‌ను అక్కడికి తరలించాలని కోరారు. నామని తిరుపతి, కావిరి రాంబాబు, చిట్యాల అరుణ్‌కుమార్, బొగ్గుల నాగేశ్వర్ రావు, ఎస్ కే మహబూబ్, బోట రాములు, పాడెం లక్ష్మీ, పుల్ల సుశీల, చిట్యాల సీత, చిట్యాల మాణిక్యం పాల్గొన్నారు.

మూడు బెల్ట్‌షాపుల్లో చోరీ!

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మూడు బెల్ట్‌షాపుల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిసింది. మద్యం దుకాణాలకు సమీపంలోని మూడు బెల్ట్‌షాపుల్లో చోరీకి పాలపడి ఫుల్‌బాటిళ్లు, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌తోపాటు మద్యం క్వార్టర్ సీసాలను కూడా ఎత్తుకెళ్లినట్లు సమాచారం. అయితే బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. మద్యానికి బానిసైన వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు సమాచారం.

వ్యాధులపై అప్రమత్తత అవసరం


కాటారం: విద్యార్థినులతో మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక


మల్హర్: విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది


చిట్యాల: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాటారం: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి మౌనిక సూచించారు. మండలంలోని దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలతో పాటు మండల కేంద్రానికి సమీపంలోని చింతకాని క్రాస్ వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు జ్వరం, రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హాస్టల్‌లో వంటగది, ఆహారాపదార్థాలను, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్‌వాష్, పర్సనల్ హైజిన్‌పై వైద్యురాలు మౌనిక అవగాహన కల్పించారు. చింతకాని క్రాస్ రోడ్ వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎచ్‌పీ డాక్టర్ సుమన్, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్‌ఎంలు విజయ, లక్ష్మి, రజిని, సరళ, పంచాయతీ కార్యదర్శి శేఖర్, ఆశవర్కర్లు రజిత, లక్ష్మి, వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాల: సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థినులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఒడితల పీహెచ్‌సీ వైద్యురాలు రాగల్ల మౌనిక కోరారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విద్యార్థినులకు జ్వరం, రక్త హీనత, కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలని అన్నారు. అలాగే ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే నిర్వహించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంజీవరెడ్డి, సుమలత, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని మల్లారం కస్తూరిబా గాంధీ, ఎడ్లపల్లి మోడల్ స్కూల్ వసతి గృహాల్లో వైద్య సిబ్బంది గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 172 మంది విద్యార్థులను పరీక్షించి, మందులు అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థుల రక్త నమునాలు సేకరించి, ల్యాబ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాజు, ప్రత్యూష, సూపర్‌వైజర్స్ నాగరాజు, రాధ, డీఈఓ చంద్రమోహన్, హెల్త్ అసిస్టెంట్స్ సదర్‌లాల్, హెమ్‌సింగ్, ఏఎన్‌ఎంస్ సాధన, సఫియా, లక్ష్మి, ఉమ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం


బంద్‌లో పాల్గొన్న నాయకులు

టేకుమట్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలకు నిరసనగా మండల కేంద్రంలో హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బందు విజయవంతమైంది. ఈ సందర్భంగా వ్యాపార సముదాయాలు బందుకు మద్దతునిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు బంద్‌ను పాటించారు. అనంతరం బంద్‌కు సహకరించిన వర్తక వ్యాపార సముదాయాలకు హిందూ పరిరక్షణ సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.